# జర్నలిస్ట్ వార్త

RNI NO :Title-Code :-TELTEL02102

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...


## ఆరు రాష్ట్రాల్లో హోంశాఖ సెక్రటరీల తొలగింపు




4లో.


WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103



సంపుటి - 1 సంచిక - 172 మంగళవారం 19 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# గవర్నర్ తమిళిసై రాజీనామా



### లోక్ సభ బరిలో తమిళిసై!
### పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి కూడా రిజైన్
### తమిళనాడు నుంచి లోక్ సభకు పోటీ

**హైదరాబాద్ మార్చి18(జర్నలిస్ట్ వార్త) :**తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాజీనామా చేశారు. సోమవారం ఉదయం తమిళిసై తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ బాధ్యతల నుంచి కూడా తప్పుకుంటున్నట్లు వెల్లడించారు. ఈమేరకు తెలంగాణ గవర్నర్ ఆఫీసు నుంచి అధికారికంగా ప్రకటన వెలువడింది. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో తమిళిసై రాజీనామా సంచలనంగా మారింది. లోక్ సభ ఎన్నికల బరిలో తమిళిసై నిలబడతారని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది.అయితే, అలాంటిదేమీ లేదని గతంలో స్పష్టం చేసిన తమిళిసై.. ప్రస్తుతం తన పదవికి రాజీనామా చేయడంతో లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయమని తేలిపోయింది. తమిళనాడు నుంచి తమిళిసై లోక్ సభ బరిలో దిగనున్నట్లు తెలుస్తోంది. తమిళిసై నాడార్ సామాజిక వర్గానికి చెందిన లీడర్.. దీంతో నాడార్ ల ప్రభావం ఎక్కువగా ఉన్న చెన్నై సౌత్, తిరునల్వేలి, కన్యాకుమారి నియోజకవర్గాల్లో ఏదో ఒక చోటు నుంచి తమిళిసై పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది.




# అవినీతిపరులను వదిలిపెట్టం

- శక్తికి, దాని వ్యతిరేకుల మధ్య పోటీ
- మహిళల సంరక్షణకు ప్రాణాలైన ఇస్తా
- కాళేశ్వరంలో భారీ అవినీతి జరిగింది
- లిక్కర్ స్కామ్‌లో కవిత కమీషన్ల దందా చేసింది
- కాంగ్రెస్ ఇక్కడ దోచి.. ఢిల్లీకి పంపిణీ చేస్తోంది
- తెలంగాణ ప్రజలు కమలం వైపే ఉన్నారు
- జగిత్యాల విజయ సంకల్ప సభలో ప్రధాని మోదీ

2లో.

(జర్నలిస్ట్ వార్త)జగిత్యాల : దేశంలోని ప్రతీ తల్లీ, ప్రతీ కూతురూ శక్తి స్వరూపమేనని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత మాతతో పాటు ప్రతీ తల్లిని, ప్రతీ సోదరీమణిని శక్తి స్వరూపంగా పూజిస్తానని చెప్పారు. ఇలాంటి శక్తి స్వరూపాన్ని నాశనం చేస్తామంటూ కొందరు ఛాలెంజ్ చేస్తున్నారని రాహుల్ గాంధీ పేరు ఎత్తకుండా విమర్శించారు. ఆ ఛాలెంజ్ ను తాను స్వీకరిస్తున్నానని, దేశంలోని శక్తి స్వరూపాన్ని తన ప్రాణమిచ్చైనా కాపాడుకుంటానని మోదీ పేర్కొన్నారు. జగిత్యాలలో జరుగుతున్న బీజేపీ విజయసంకల్ప వేదికపై మాట్లాడుతూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

## ఎంఐఎం తొలి జాబితా విడుదల..




2లో.

హైదరాబాద్ నుంచి అసదుద్దీన్ ఔరంగాబాద్ నుంచి ఇంతియాజ్

బీహార్ కిషన్‌గంజ్ నుంచి అక్తరుల్ ఇమాన్

బీహార్, యుపి, మహారాష్ట్రలో మరికొన్ని స్థానాలలోనూ పోటీ

## ఒకసారి ఓడితే నష్టమేమీ లేదు : కెసిఆర్

"ప్రవీణ్‌కుమార్‌ను భారాస ప్రధాన కార్యదర్శిగా నియమిస్తాం. పార్టీ నిర్మాణం చేసుకుందాం.. కమిటీలు వేసుకుందాం. రానున్న రోజుల్లో మనం అద్భుతమైన విజయం సాధిస్తాం. బహుజన సిద్ధాంతం అమలు దిశగా దేశానికి తెలంగాణను టార్చ్ బేరర్‌గా చేద్దాం" పార్టీ శ్రేణులకు కేసీఆర్ పిలుపు

### కేసీఆర్ సమక్షంలో కారెక్కిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్..

2లో.



# హస్తినలో రేవంత్

## తెలంగాణ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు..

సోనియాగాంధీ, ప్రియాంకగాంధీలను కలిసిన సీఎం రేవంత్ రెడ్డి

టెన్ జన్‌పథ్‌కు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై వారి మధ్య చర్చ

ప్రియాంక గాంధీని కలిసిన ఫొటోను షేర్ చేసిన రేవంత్ రెడ్డి



## ఆప్ లీడర్లతో కలిసి కవిత అక్రమాలకు పాల్పడ్డారు: ఇడి



**హైదరాబాద్ మార్చి18(జర్నలిస్ట్ వార్త) :** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎంఎల్‌సి కవిత అరెస్టుపై దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కీలక ప్రకటన విడుదల చేసింది. ఈ కేసులో దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 245 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్టు పేర్కొంది. ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై, ముంబైతో పాటు పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించామని వెల్లడించింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఇప్పటివరకు 15 మందిని అరెస్ట్ చేశామని.. మొత్తం రూ.128.79 కోట్లు సీజ్ చేశామని వెల్లడించింది. మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్‌తో పాటు పలువురు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారని వివరించింది.ఈ నెల 23 వరకు కవితకు న్యాయస్థానం రిమాండ్ విధించిందని ఇడి పేర్కొంది. **మిగతాది 2లో...**

# అవినీతిపరులను వదిలిపెట్టం

(జర్నలిస్ట్ వార్త)జగిత్యాల :
'దేశంలోని ప్రతీ మహిళా నాకు ఓ శక్తి స్వరూపమే. చంద్రయాన్ విజయవంతమైన ప్రాంతానికి శివశక్తి అని నామకరణం చేశాం. అలాంటి శక్తిని వినాశనం చేస్తామని కొంతమంది బయలుదేరారు. ఇప్పుడు శక్తి వినాశకారులకు, శక్తిని పూజించే వారికి మధ్య పోరాటం మొదలైంది. శక్తి ఆశీర్వాదం ఎవరికి ఉందనేది జూన్ 4న తెలుస్తుంది' అని మోదీ చెప్పారు. శక్తిని ఖతమ్ చేస్తానన్న రాహుల్ గాంధీ ఛాలెంజ్‌ను తాను స్వీకరిస్తున్నానని, విపక్ష కూటమి నుంచి శక్తిని కాపాడుకుంటానని మోదీ పేర్కొన్నారు.
ప్రపంచలోనే అతిపెద్ద ఎన్నికల పండగ మన దేశంలో మొదలైందని మోదీ అన్నారు. లోక్ సభ ఎన్నికల సందర్భంగా మే 13న తెలంగాణ ప్రజలు చరిత్రను తిరగరాయబోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీకి ఆదరణ పెరుగుతోందని, వికసిత్ భారత్ కోసం తెలంగాణ ప్రజలు బీజేపీకి అండగా నిలబడబోతున్నారని చెప్పారు. మూడు రోజుల్లో తాను రెండుసార్లు తెలంగాణకు వచ్చానని, తెలంగాణ అభివృద్ధిపై బీజేపీ చిత్తశుద్ధితో ఉందన్నారు.
రాష్ట్రంలోని వివిధ అభివృద్ధి పనులకు వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మోదీ చెప్పారు. దేశవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమికి 400 సీట్లకు పైగా వస్తాయని దీమా వ్యక్తం చేశారు. తెలంగాణలోనూ అబ్ కీ బార్ 400 కే పార్ నినాదం వినిపిస్తోందని చెప్పారు. ఈ లోక్ సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ పని ఖతమైపోతుందని జోస్యం చెప్పారు. 'ప్రధాని మోడీ 400 దాటాలి.. బీజేపీకి ఓటు వేయాలి' అని తెలుగులో చెప్పి బీజేపీ కార్యకర్తలు, సభకు వచ్చిన జనాలను మోదీ ఉత్సాహపరిచారు.



### రాహుల్ గాంధీ ఏమన్నారంటే..

న్యాయ్ యాత్ర ముగింపు సందర్భంగా ముంబైలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. దేశంలో ప్రస్తుతం ఓ శక్తి విర్రవీగుతోందని ఆరోపించారు. ఆ శక్తిని అణచివేయడానికి, దానిని నాశనం చేయడానికి మిగతా పార్టీలతో కలిసి పోరాడుతున్నామని చెప్పారు. ఇండియా కూటమి సంఘటితంగా ఈ శక్తిపై పోరాటం చేస్తుందని చెప్పారు.

### కాళేశ్వరం నుంచి ఢిల్లీ దాకా బీఆర్ఎస్ అవినీతి: మోదీ

తెలంగాణను పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ పార్టీ నేతల అవినీతి గల్లీ నుంచి ఢిల్లీ దాకా పాకిందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఢిల్లీ లిక్కర్ స్కామ్ దాకా ఆ పార్టీ నేతలు అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. జగిత్యాలలో సోమవారం జరిగిన బీజేపీ విజయ సంకల్ప సభలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టును పరోక్షంగా ప్రస్తావిస్తూ.. బీఆర్ఎస్ నేతల అవినీతిని సభా వేదికపై ఎండగట్టారు.
తెలంగాణ వికాసం కోసం వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించుకోవాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను ఓడించి ఆ పార్టీ నేతలకు గుణపాఠం నేర్పాలని కోరారు. కవిత అరెస్ట్‌పై మోదీ మొదటిసారి స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బీఆర్ఎస్ సర్కారు అవినీతికి పాల్పడగా.. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ఆ పార్టీ నేతలు కమీషన్లు దండుకున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణను ఏటీఎంలా వాడుకుందని ఆరోపించారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే చేస్తోందని, కాంగ్రెస్ బీఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలేనని మండిపడ్డారు. బీఆర్ఎస్ ను కాపాడాలని చూస్తోందని, అందుకే అవినీతిపై విచారణ జరిపించడంలేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అయితే, తాము మాత్రం అవినీతి పరులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని మోదీ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తనను తిట్టడమే పనిగా పెట్టుకున్నాయని విమర్శించారు. తాము మాత్రం రాష్ట్రాలను, దేశాన్ని అభివృద్ధి వైపు నడిపించడానికి నిరంతరం పాటుపడుతున్నామని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి మోదీ గ్యారంటీ అని చెప్పారు. రాష్ట్రాన్ని, దేశాన్ని దోచుకోవడమే లక్ష్యంగా పనిచేసే కుటుంబ పార్టీలను దూరంపెట్టాలని ప్రజలను కోరారు. మహిళా శక్తి చాలా గొప్పదని పేర్కొంటూ మరోసారి బీజేపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని మోదీ పిలుపునిచ్చారు.

# మాజీ ఎంపి జితేందర్ రెడ్డి డబ్బుకు అమ్ముడు పోయాడు

## : బిజెపి నేత రఘునందన్ రావు



హైదరాబాద్ మార్చి18(జర్నలిస్ట్ వార్త)
మాజీ ఎంపి జితేందర్ రెడ్డి బిజెపిలో పెద్ద పెద్ద పదవులు అనుభవించి, పార్టీకి సిద్ధాంతం లేదని మాట్లాడటం చూస్తుంటే ఆయన డబ్బులకు అమ్ముడు పోయాడనే సంగతి అర్థమవుతోందని మెదక్ ఎంపి అభ్యర్థి రఘునందన్ రావు దుయ్యబట్టారు. ఆయన కుమారుడికి సీటు ఇస్తే పార్టీకి సిద్ధాంతం ఉన్నట్లు, ఆయనకు ఎంపీ టికెటు ఇవ్వక పోతే సిద్ధాంతం లేనట్లా? అని ప్రశ్నించారు. ఏ ఆర్థిక ప్రయోజనాలు కోసం ఆయన పార్టీ మారారో ప్రజలు గమనిస్తున్నారని మండిపడ్డారు. సోమవారం తమ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన బంధువులు కంపెనీ అమ్ముతున్న ఫ్లాట్స్‌పై చేవెళ్ల ఎంపీతో కలిసి ఏమీ మాట్లాడారు ఈస్టర్న్ నిర్మాణ కంపెనీ ఎవరి భూములను ఆక్రమించింది ఎంత? సర్వే నంబర్ 343, 403 లో ఏమీ జరుగుతోందని ప్రశ్నించారు. అడ్డగోలు కంపెనీ మీద ఇడి, ఐటికి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. తమ దగ్గర పూర్తి సమాచారం ఉందని, ఎందుకు పార్టీ మారారో ఆధారాలతో సహా త్వరలో బయటపెడుతానని పేర్కొన్నారు. నీలాంటి వారు బిజెపికి కొత్తగా సిద్ధాంతాలు నేర్పించాల్సిన అవసరం లేదని, వ్యక్తిగత, ఆర్థిక లబ్ధి కోసం మీరు పార్టీ మారారని ఆరోపించారు. పాలమూరులో మీరు, మీ కొడుకు కోసం పని చేయకుండా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేయలేదా అని నిలదీశారు. నిర్మాణ కంపెనీల నుండి డబ్బులు వందల కోట్లు చేతులు మారాయని, కాంగ్రెస్ ఎంపి అభ్యర్థులకు ఆ డబ్బులు పంపబోతున్నారని పేర్కొన్నారు.

# ఒకసారి ఓడితే నష్టమేమీ లేదు : కెసిఆర్

హైదరాబాద్ మార్చి18(జర్నలిస్ట్ వార్త) :
ఎర్రవల్లి : ధికారం కోల్పోవడంపై బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. పద్నాలుగేళ్లు రాష్ట్ర సాధన కోసం పదేళ్లు ప్రగతి సాధన కోసం తన ఉద్యమం సాగిందని చెప్పారు. ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌లో సోమవారం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయనకు గులాబీ కండువా వేసి ఆహ్వానించిన కేసీఆర్ ఈ సందర్భంగా పార్టీ నాయకత్వానికి దిశానిర్దేశం చేశారు.
కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు నమ్మి ప్రజలు అటు వెళ్లారని.. ఇప్పుడు వారికి వాస్తవం అర్థమవుతున్నదని పేర్కొన్నారు. ఒకసారి ఓడితే నష్టమేమీ లేదని స్పష్టం చేశారు. అధికారం ఉన్నా లేకపోయినా ఒకేలా ఉండాలని తెలిపారు.
'పాలకుల మీద ఐకమత్యంతో పోరాటం చేసి హక్కులు సాధించుకోవాలే. కలగలిసి పోవాలంటే ఏం చేయాలో ఆలోచన చేయాలి. అగ్రవర్ణాల్లోని పేదలతో కూడా కలుపుకు పోవాలి. ప్రతీప శక్తులమీద పోరాడుతూనే కలిసివచ్చే శక్తులను కలుపుకపోవాలి. వారి శక్తిని మనం ఉపయోగించుకోవాలి. 20 శాతం ఉన్న దళితులు ఐక్యంగా నిలబడితే సాధించలేనిదే మీ లేదు' అని కేసీఆర్ చెప్పారు. రాజకీయాల్లో అనేక కష్టాలు వస్తాయి. తట్టుకొని నమ్మిన సిద్ధాంతం కోసం ముందుకు సాగాలి. దేశానికే ఆదర్శంగా మన సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టినం' అని గుర్తు చేశారు.'తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో నేను తిన్న తిట్లు ఎవరూ తినలే. నా మీద దండకాలు కూడా రాసింగ్రు. ఎన్ని కష్టాలెదురైనా ప్రలోభాలు పెట్టినా తెలంగాణ వాదాన్ని వదల్లేదు. అవసరమైన పంథాను ముందుపెట్టి తెలంగాణ కోసం పోరాటం లో కేంద్రాన్ని గజ్జున వణికించినం. శూన్యం నుంచి సుడిగాలిని సృష్టించినం. గిటువంటి సమస్యలెన్నో చూసినం ఇదో లెక్కగాదు. మీలాంటి యువత నాయకత్వం ఎదిగితే.. ఈ చిల్లర వచ్చిపోయే వాళ్ల ఇట్లాంటి స్వార్థ పరుల అవసరం ఉండదు' అని పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. వచ్చే ఎన్నికల వరకు మీరంతా నాయకులుగా ఎదగాలని సూచించారు.
'దేశంలో ఇంతవరకూ దళిత బంధు వంటి పథకం ఎవరూ తీసుకురాలేదు. అనేక చర్చలు మేధోమథనం తర్వాత రైతుబంధు తీసుకువచ్చాం. సాగునీటి ప్రాజెక్టులను తెచ్చినం తద్వారా రాష్ట్రంలో మూడు



కోట్ల టన్నులకు ధాన్యం ఉత్పత్తి చేరుకుంది' అని కేసీఆర్ గుర్తు చేశారు.'నాటి ఉద్యమ కాలంలో అనివార్యంగా కొన్ని మాటలు అనాల్సి వచ్చిందే తప్ప ఎట్లబడితే అట్లా అసభ్యంగా బూతు మాటలు మాట్లాడలేదు. పరుష పదాలతో దురుసు మాటలతో తిట్టలేదు' అని వివరించారు. 'ప్రజా జీవితం అన్నప్పుడు ఓడినా గెలిచినా ఒకేలా ఉండాలే. మన ప్రజలు మన రాష్ట్రం అనే పద్ధతిలోనే ముందుకుసాగాలి. అధికారం ఉంటే ఒకతీరు లేకుంటే మరో తీరు ఉండొద్దు' అని సూచించారు.
'అగాధంలో ఉన్న తెలంగాణకు బీఆర్ఎస్ పాలనలో ధైర్యం వచ్చింది. ఇవి ఎక్కడ పోవు. వచ్చేటాయన ఎక్కువ ఇస్తాడనే ఆశకు పోయి మోసపోయింర్రు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు నమ్మి అటు మళ్లారు. ఇప్పుడు ప్రజలకు అర్థమైతున్నది వాస్తవం. ఒకసారి ఓడితే నష్టమేమీ లేదు. గాడిద వెంట పోతేనే గదా గుర్రాల విలువ తెలుసుద్ది' అని ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై వ్యంగ్యాంస్త్రాలు సంధించారు.
తాను ఒక్కసారి మాటిస్తే మడమ తిప్పకుండా ఉంటానని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు రెండున్నర సంవత్సరాలుగా బీఎస్పీ పార్టీలో 50 వేల కిలోమీటర్ల వరకు యాత్ర చేసి, బహుజనులను చైతన్యపరిచామని చెప్పారు. బహుజనవాదం, తెలంగాణవాదం రెండూ ఒకటేనని.. ఈ రెండూ అణచివేతకు గురయ్యానని చెప్పారు. ఈ రెండు ఒక్కటైతేనే.. తెలంగాణ రాష్ట్రం మరింత బలపడుతుందని తెలిపారు. తాను నిజంగానే అమ్ముడుపోతే.. అధికార పార్టీలో ఉండేవాడినని తనపై వస్తున్న విమర్శల్ని తిప్పికొట్టారు. సోషల్ మీడియాలో వచ్చే దుష్ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయదుందుభి మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.పరిస్థితులకు అనుగుణంగా కొత్త దారిని వెతుక్కోవాల్సి వచ్చిందని వివరించిన ప్రవీణ్‌కుమార్.. తన నాయకత్వంలో తీసుకున్న నిర్ణయాల కారణంగా బీఎస్పీ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే తాను బీఆర్ఎస్‌లోకి చేరానన్నారు. తాను ప్యాకేజీల కోసం కాదు, ప్రజాసేవ కోసమే ఈ పార్టీలోకి చేరడం జరిగిందని స్పష్టం చేశారు. ఎన్ని ఒడిదొడుకులు వచ్చినా ముందుకు సాగాల్సిందేనని.. ఇదే తాను నమ్మిన ధర్మమని చెప్పుకొచ్చారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం గత పదేళ్లలో స్వర్ణయుగాన్ని చూసిందని.. ఇప్పుడు కేసీఆర్ అధికారంలో లేకపోయినా ప్రజల గుండెల్లో ఉన్నారని చెప్పారు. బహుజన వాదం అంటే స్వార్థపరులు ఉండేది కాదన్న ఆయన.. తెలంగాణ పునర్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని నిర్ణయించుకొని వచ్చామని తెలిపారు. తన గుండెల్లో ఇప్పటికీ బహుజన వాదం ఉందని పేర్కొన్నారు.
. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్ రెడ్డి, మెతుకు ఆనంద్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్య, గువ్వల బాలరాజు, మాజీ చైర్మన్లు రవీందర్ సింగ్, బాలరాజు యాదవ్, తదితరులున్నారు

## రేవంత్ రెడ్డీ... నేనూ పాలమూరు బిడ్డనే, నాకు వార్నింగ్ ఇవ్వడం మానుకో

### : ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు తానూ పాలమూరు బిడ్డనేనని... తనకు వార్నింగ్‌లు ఇవ్వడం మానుకోవాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌కు వచ్చారు. అక్కడి నుంచి గజ్వేల్ బయలుదేరారు. కేసీఆర్ సమక్షంలో ఆయన బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు. తెలంగాణ భవన్ నుంచి బయలుదేరడానికి ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణలో కేసీఆర్ అధికారంలో లేకపోవడం దురదృష్టకరమన్నారు. తాను ఏదీ ఆశించి బీఆర్ఎస్‌లో చేరడం లేదని... తెలంగాణ పునర్నిర్మాణం కోసం... తెలంగాణ విశాల ప్రయోజనాల కోసం తాను బీఆర్ఎస్‌లోకి వెళుతున్నానని పేర్కొన్నారు. తాను ఎక్కడ ఉన్నా బహుజనుల ప్రయోజనాల కోసం కృషి చేస్తానన్నారు.తన వెంట నడిచే అభిమానులకు ఆయన థ్యాంక్స్ చెప్పారు. తెలంగాణ వాదం... బహుజన వాదం రెండూ ఒకటే అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ స్వర్ణయుగంగా మారిందన్నారు. అందుకే తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వామ్యం అయ్యేందుకు పార్టీలో చేరుతున్నానన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పని చేసే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. తాను ప్రత్యేక పరిస్థితుల్లో బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. చితికిపోయిన తెలంగాణకు కేసీఆర్ విముక్తి కలిగించారన్నారు. గత పదేళ్లు తెలంగాణ స్వర్ణయుగమన్నారు.
కేసీఆర్ అధికారంలో లేకపోవడం దురదృష్టకరమన్నారు. తనకు టీఎస్‌పీఎస్సీ ఆఫర్ ఇచ్చారని... కానీ దానిని తిరస్కరించానని చెప్పారు. ఎవరు ఎక్కడైనా పని చేసుకునే స్వేచ్ఛ ఉందన్నారు. రేవంత్ రెడ్డి, తాను పాలమూరు బిడ్డలమని... కాబట్టి ఆయన తనను బెదిరించడం మానుకోవాలని సూచించారు. ఆయన బెదిరింపులకు భయపడేది లేదన్నారు. మీరు గేట్లు తెరిస్తే అందులో చేరుతున్న గొర్రెల్లో తాను ఒకడిని కాదల్చుకోలేదని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. కాగా, ఆయన తెలంగాణ భవన్ నుంచి గజ్వేల్‌కు బయలుదేరారు. కేసీఆర్ సమక్షంలో ఆయన బీఆర్ఎస్‌లో చేరనున్నారు.

# హస్తినలో రేవంత్..

## తెలంగాణ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు..

(మొదటి పేజి తరువాయి)
ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో సమావేశమయ్యారు. 100 రోజుల పాలన, హామీల అమలుపై హైకమాండ్‌కు రేవంత్ వివరణ ఇస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే పార్టీ బలోపేతం, నేతల చేరికలపై సోనియా గాంధీతో రేవంత్ రెడ్డి చర్చిస్తున్నట్లు సమాచారం.
అదేవిధంగా లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల ప్రచారంపై అధిష్టానంతో రేవంత్ చర్చలు జరుపుతున్నారు. కాగా, రేపు లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ సీఈసీ సమావేశంలో.. రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. అలాగే మేనిఫెస్టో ముసాయిదా ఖరారుపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కానుంది. ఈ రెండు సమావేశాల్లో రేవంత్ రెడ్డి పాల్గొనబోతున్నారు.
ఈ సమావేశంలో తెలంగాణలోని 13 స్థానాలకు అభ్యర్థులను కాంగ్రెస్ హైకమాండ్ ఎంపిక చేయనుంది. కాంగ్రెస్ తొలి జాబితాలో ఇప్పటి వరకు 4 లోక్‌సభ స్థానాలకు (మహబూబ్‌నగర్, మహబూబాబాద్, జహీరాబాద్, నల్గొండ) అభ్యర్థులను ప్రకటించింది. ఇక వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, సికింద్రాబాద్, హైదరాబాద్, పెద్దపల్లి, భువనగిరి, చేవెళ్ల, నాగర్ కర్నూల్, మల్కాజిగిరి, మెదక్, నిజామాబాద్ స్థానాలకు సంబంధించిన అభ్యర్థుల జాబితా పెండింగ్‌లో ఉంది. ఈ స్థానాలకు సంబంధించి ఆశావహులు ఎవరు? అక్కడ ఎవరు గెలిచే అవకాశం ఉంది? వంటి అంశాలన్నింటిపై సోనియా, రాహుల్ గాంధీలతో రేవంత్ చర్చిస్తున్నట్లు సమాచారం. వీటితో పాటు ఎన్నికల ప్రచార అంశంపై కూడా చర్చించనున్నారు. అలాగే లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి సోనియా, రాహుల్ గాంధీలను సీఎం రేవంత్ ఆహ్వానించనున్నారు.

## ఎంఐఎం తొలి జాబితా విడుదల..



హైదరాబాద్ మార్చి18(జర్నలిస్ట్ వార్త) :
హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఎంఐఎం నేడు లోక్ సభకు ముగ్గురు అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది.. హైదరాబాద్ స్థానం నుంచి ఆ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ మరోసారి పోటీ చేయనున్నారు.. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ నుంచి ఇంతియాజ్ జలీల్, బీహార్ లోని కిషన్‌గంజ్ నుంచి అక్తరుల్ ఇమాన్ పోటీకి దిగుతున్నారు ఈ మేరకు అసద్ ఆ పార్టీ తొలి జాబితాను నేడు విడుదల చేశారు.కాగా, బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర అభ్యర్థులపై పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చర్చిస్తున్నామని.. త్వరలో అక్కడ అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని చెప్పారు అసదుద్దీన్. బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల్లో ఏఐఎంఐఎం నుంచి ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనే విషయాన్ని త్వరలోనే చెబుతామని వెల్లడించారు.ద

# ఆప్ లీడర్లతో కలిసి కవిత అక్రమాలకు ప్పాల్పడ్డారు: ఇడి

(మొదటి పేజి తరువాయి)
బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు సోమవారం సాయంత్రం ఇడి కార్యాలయానికి వెళ్లారు. ములాఖత్‌లో భాగంగా వీరిద్దరు కవితను ఇడి కేంద్ర కార్యాలయంలో కలిశారు. కవితను ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు కలిసేందుకు కోర్టు అనుమతించింది. మరోవైపు కవితతో ములాఖత్ కోసం భర్త అనిల్ రాలేదు. ఆయనకూ ఇడి నోటీసులు జారీ చేసింది. తాను విచారణకు హాజరు కాలేనని ఇడికి లేఖ రాశారు. పది రోజుల వరకు ఇడి కార్యాలయానికి రాలేనని లేఖలో పేర్కొన్నట్లుగా సమాచారం. అందుబాటులో ఉండి ఇడి విచారణక హాజరు కాలేదన్న అభిప్రాయం వస్తుందనే ఆయన ములాఖత్‌కు దూరంగా ఉన్నట్లుగా భావిస్తున్నారు.

### ఇడిపై సుప్రీంకోర్టులో కవిత పిటిషన్

దర్యాప్తు సంస్థ ఇడిపై చర్యలు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ ఎంఎల్‌సి కవిత దాఖలు చేశారు. సుప్రీం కోర్టులో ఢిల్లీ లిక్కర్ కేసుకి సంబంధించి విచారణ జరుగుతుండగానే, అదే కేసులో తనను అరెస్టు చేశారని ఆమె ప్రస్తావించారు. తనను అరెస్ట్ చేయబోమంటూ గతంలో సుప్రీంకోర్టుకి ఇడి అధికారులు వెల్లడించారని, సర్వోన్నత న్యాయస్థానానికి మాటిచ్చి తప్పారని తన పిటిషన్ లో తెలిపారు. దర్యాప్తు సంస్థ ఇడి కోర్టు ధిక్కరణకు పాల్పడిందని కవిత అన్నారు. ఇడిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 19వ తేదీన ఆమె పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# ఎమ్మెల్యేను గెలిపించుకున్నది ఇందుకోసమేనా..?

## - పట్టణ అధ్యక్షున్ని ఎమ్మెల్యే ఎలా తొలగిస్తారు..?
## - కనీసం సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదా..?



**వర్ధన్నపేట, మార్చి18(జర్నలిస్ట్ వార్త):** జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పార్టీ అభ్యర్థిని గెలిపించుకోవాలని సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త సైనికుల పనిచేసారని సీనియర్ కార్యకర్త చిలువేరు కుమారస్వామి అన్నారు. పది సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటం చేస్తూ, అధికార పార్టీ నేతలతో అనేక అవమానాలు భరిస్తూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. వర్ధన్నపేట పట్టణ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు దాదాపుగా అందరూ అనుభవజ్ఞులే అన్నారు.
ఒక్కొక్కరికి పార్టీలో దాదాపుగా 40 సంవత్సరాలుగా అనుబంధం కలిగి ఉన్నారని తెలిపారు. 2014 సంవత్సరం నుంచి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పనిచేసిన తనను తొలగించడానికి కనీసం సమాచారమైనా ఇవ్వకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడాన్ని వారు తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. ఐపీఎస్ అధికారిగా విధులు నిర్వర్తించి రిటైర్డ్ మెంట్ తర్వాత పార్టీలోకి రంగ ప్రవేశం చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వర్ధన్నపేటకు వచ్చిన సమయంలో తాను ఎవరికి తెలవక పోయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ గెలుపు సాధన కొరకు పనిచేసిన వారిని గుర్తించకపోవడం బాధాకరమన్నారు. పట్టణ అధ్యక్షులుగా బాధితులు నిర్వహిస్తూ, ఏదైనా లోపాలు ఏర్పడినట్లయితే అట్టి విషయమై చర్చించి, ముఖ్య కార్యకర్తల సమావేశంలో నిర్ణయం తీసుకోవాల్సింది అన్నారు. ఎమ్మెల్యే బాధ్యతలు చేపట్టిన సమయం నుంచి ఇప్పటివరకు పార్టీ కార్యక్రమాలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో మారిన వారితో, మరి కొంతమంది పదవులను ఆశించి ఎమ్మెల్యేను అంటిపెట్టుకు తిరిగేవాళ్లతో మాత్రమే పర్యటించడం సీనియర్ కార్యకర్తలను అవమానించడమే అన్నారు. వర్గాల పేరుతో కొంతమంది సీనియర్ కార్యకర్తలను నాయకులను విడదీసి పరిపాలించడం సరికాదన్నారు. ఇట్టి విషయమై కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణక్కను మర్యాదపూర్వకంగా కలిసి వర్ధన్నపేట రాజకీయ వ్యవహారాలపై చర్చించనున్నట్లు వివరించారు. ఇప్పటికైనా ఏకాభిప్రాయాలను మానుకుని కార్యకర్తల అభిప్రాయాలను సేకరిస్తూ ముందుకు పోవాలన్నారు. లేని యెడల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు పట్టణ పరిధిలోని 30 మంది ముఖ్య కార్యకర్తలంతా వెళ్లి వారికి తమ గోడును విన్నవించుకోవడం జరుగుతుందని అన్నారు. ఇలా తనదైన శైలిలో వ్యవహరిస్తూ కార్యకర్తలను అవమానిస్తే పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

# కాంగ్రెస్ వచ్చింది.. పంట తగులబెట్టే దుస్థితి తెచ్చింది

## పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



**హైదరాబాద్ మార్చి18(జర్నలిస్ట్ వార్త) :**
బీఆర్ఎస్ పార్టీని అప్రతిష్ఠపాలు చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నీళ్లు ఇవ్వడం లేదని , కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని అన్నెపర్తి గ్రామంతో పాటు ఇతర గ్రామాలలో ఆయన నేడు పర్యటించారు.. ఈ సందర్భంగా ఎండిపోయిన వరి, మిరప తోటలను రైతులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూ.. కేసీఆర్ పాలనలో 10 సంవత్సరాల్లో ప్రతి ఎకరాకు నీళ్లు ఇచ్చామన్నారు. కాంగ్రెస్ వచ్చిన కొద్ది నెలల్లోనే రైతులు పంటలు తగలపెట్టుకునే దీన స్థితికి తీసుకొచ్చారని మండిపడ్డారు. .ఏ ఒక్క మంత్రి, ఎమ్మెల్యే ,అధికారులు కూడా రైతుల వంక కన్నెత్తి చూడట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.. కాంగ్రెస్ మంత్రులకు రాజకీయాలు, అక్రమ వసూళ్లు, దందాలు తప్ప ,రైతుల గోడు పట్టట్లేదని అన్నారు ..జిల్లా మంత్రులు కోమటిరెడ్డి,.ఉత్తమ్ లు ఉత్తరకుమారులని, ప్రగల్భాలు పలకడం తప్పా దేనికి పనికిరారని అన్నారు%8ా% వారుకి ఎంతసేపు రాజకీయాలు చేయడం తప్ప రైతుల సంక్షేమం పట్టలేదని అన్నారు%8ా% కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య పూరిత వైఖరితో రైతులు మరింత అగాధంలోకి వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు ..ఇప్పటికైనా కళ్ళు తెరిచి కరువుపై సర్వే చేయించి, నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు ..లేదంటే రైతుల ఉసురు తగిలి కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం అవుతుందని అన్నారు%8ా% ఎండిపోయిన వరి రైతులకు ఎకరాకు రూ.50 వేలు, మిరప రైతులకు రూ.80 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఆ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, ,నల్గొండ మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, %ఎతీం% నాయకులు, చెరుకు సుధాకర్, పంకజ్ యాదవ్.. దీప వెంకట్ రెడ్డి యాదయ్య గౌడ్, నాగరాజు, దేవేందర్, లింగుస్వామి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రద్దీ ప్రాంతాల్లో రోడ్డు షోలకు అనుమతి లేదు..

## సెలవు రోజుల్లోనే రోడ్డు షోలు పెట్టుకోవాలి: తెలంగాణ సీఈవో వికాస్ రాజ్ కీలక సూచనలు

**హైదరాబాద్ మార్చి18(జర్నలిస్ట్ వార్త) :**
ఆయా పార్టీల నేతలు రోడ్డు షోలను సెలవు రోజుల్లో పెట్టుకోవాలని.. రద్దీ ప్రాంతాల్లో రోడ్డు షోలకు అనుమతిలేదని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ తెలిపారు. సోమవారం బీఆర్కే భవన్‌లో ఆయన ఎన్నికల సందర్భంగా కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదన్నారు. చిన్నపిల్లలతో ఎన్నికల ప్రచారం చేయించడానికి అనుమతి లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 3 కోట్ల 30 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో 8 లక్షల మంది కొత్త ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. 85 ఏళ్లు పైబడిన వారికి ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పించినట్లు చెప్పారు. నామినేషన్ ఉపసంహరణ తర్వాత రోజు నుంచి హెూంఓటింగ్ ప్రారంభమవుతుందన్నారు. పోస్టల్ ఓటింగ్‌ను ఈసారి కొత్త సాఫ్ట్‌వేర్‌తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారులకు, సిబ్బందికి ట్రైనింగ్ ప్రాసెస్ పూర్తి అయిందన్నారు. పోలింగ్ కోసం ఈవీఎంలు సిద్ధంగా ఉన్నాయని, రిజర్వ్ ఈవీఎంలు కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. లోక్ సభ ఎన్నికలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉపఎన్నిక కోసం అన్నీ సిద్ధం చేసినట్లు తెలిపారు. 1.5 లక్షల మంది సిబ్బంది ఎన్నికల విధుల కోసం పని చేయాల్సి ఉందన్నారు. 24 గంటలు పని చేసేలా ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.రూ.50 వేల కంటే ఎక్కువ నగదు ఉంటే సంబంధిత పత్రాలు అందుబాటులో ఉండాలని, లేదంటే సీజ్ చేస్తామన్నారు.



మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్ ప్రకారమే ఎలక్షన్ జరుగుతుందన్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే సీ-విజిల్ యాప్ లేదా 1950కి ఫోన్ చేసి ప్రజలు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. రాజకీయ పార్టీలు ర్యాలీలు, సభలకు అనుమతిని సువిధా యాప్ ద్వారా తీసుకోవాలని సూచించారు. 7 లక్షల ఓటర్ కరెక్షన్లను అసెంబ్లీ ఎన్నికల తర్వాత పూర్తి చేశామన్నారు. తెలంగాణలో చిన్న పార్లమెంట్ మహబూబాబాద్ కాగా... అతిపెద్దది మల్కాజ్‌గిరి అని పేర్కొన్నారు.

# పార్టీ గుర్తులను తొలగించిన మున్సిపల్ కమీషనర్ ఇ. జోనా



వర్ధన్నపేట, మార్చి18(జర్నలిస్ట్ వార్త): పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో సోమవారం మున్సిపల్ అధికారులు పార్టీ గుర్తులను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నిభందనలు ప్రకారం రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, పోస్టర్లు, గోడలపై వాల్ రైటింగ్, పార్టీల జెండాలను తొలగించినట్లు తెలిపారు.
ఈ కార్యచరణ కొనసాగించడానికి గత రెండు రోజుల క్రితమే తమ సిబ్బందిని రెండు గ్రూపులుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెండు గ్రూపులుగా విడిపోయిన వారు ఇప్పటి వరకు 77 రకాల పార్టీ గుర్తులను తొలగించినట్లు తెలిపారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు క్లాతులతో మూసివేయడం జరిగిందన్నారు. ఇంకా మిగిలి ఉన్న వాటిని గుర్తించి, తొలగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ప్రతీ కార్యకర్త విస్తృత స్థాయిలో పనిచేయాలి

## - పిలుపునిచ్చిన బీజేపీ మండల అధ్యక్షులు



**వర్ధన్నపేట, మార్చి18(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో బిజెపి మండల అధ్యక్షులు రాయపురపు కుమారస్వామి అధ్యక్షతన సోమవారం మండల శాఖ సమామవేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో పార్టీ విస్తరణకు ప్రతి కార్యకర్త విస్తృత స్థాయిలో పనిచేయాలన్నారు. పార్టీలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో జరుగుతున్న అనేక పరిణామాలకు అనుగుణంగా మండల స్థాయిలో ప్రతీ ఒక్కరూ సానుకూలంగా స్పందించాలన్నారు. వివిధ పార్టీల నుండి బీజేపి పార్టీలోకి రావడానికి సిద్ధంగా ఉన్న కార్యకర్తలను గుర్తించి, వారిని హృదయపూర్వకంగా స్వాగతించి, వారితో పాటు పార్టీ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. మండలంలో మరింత బలమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా మండల స్థాయిలో అత్యధికంగా బీజేపీ పార్టీకి ఓట్లు వేయించే విధంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నాంపల్లి యాకయ్య, మండల ప్రధాన కార్యదర్శులు తాళ్ల పెల్లి కృష్ణమూర్తి, డోలి సతీష్, సీనియర్ నాయకులు నర్సింగరావు, మాజీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ చీపురు వెంకటస్వామి, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి నాంపల్లి యాకస్వామి, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పోశాల సురేష్, యువ మోర్చా మండల అధ్యక్షులు చెంగల సురేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు కర్క సోమిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు న్యాలం సాయిలు, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షులు గుగులోతు లక్ పతి, మైస రాజు, కత్తి రాజు, శ్రీనివాస్, శంకర్ , దూదయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రజావాణి'కి తాత్కాలిక బ్రేక్

### లోక్ సభఎన్నికల కోడ్ కారణంగా ప్రజావాణికి బ్రేక్
### హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రజావాణి కార్యక్రమం
### జూన్ 7 నుంచి తిరిగి యథాతథంగా ప్రజావాణి కార్యక్రమం




**హైదరాబాద్ మార్చి18(జర్నలిస్ట్ వార్త) :**
లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో కోడ్ కారణంగా ప్రజావాణి కార్యక్రమానికి బ్రేక్ పడింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా అధికారులు దీనిని రద్దు చేశారు. ఎన్నికలు పూర్తయి ఫలితాలు వచ్చిన తర్వాత జూన్ 7న తిరిగి యథాతథంగా ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని వారు వెల్లడించారు. జిల్లాల్లోనూ ప్రజావాణిని రద్దు చేసినట్లు ఆయా జిల్లాల కలెక్టర్లు వెల్లడించారు.

# బాండ్ల వివరాలు బయటపెట్టాలి



**మార్చి18(జర్నలిస్ట్ వార్త):**
**న్యూఢిల్లీ:** ఎన్నికల బాండ్లకు సంబంధించి తన వద్ద ఉన్న అన్ని వివరాలను వెల్లడించాలని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సోమవారం భారతీయ స్టేట్ బ్యాంకును ఆదేశించింది. ప్రతి బాం డుకు సంబంధించిన విశిష్ట సంఖ్యతో సహా ఏ వివరాలను కూడా ఎస్‌బిఐ దాచకూడదని ధర్మాసనం ఆదేశించింది. ఎన్నికల బాండ్లకు సంబంధించి తన వద్ద ఉన్న అన్ని వివరాలను అందచేయవలసిన అవసరం ఎస్‌బిఐకి ఉంది అనడంలో ఎటువంటి అనుమానాలకు ఆస్కారం లేదని చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. దాతలు కొనుగోలు చేసిన ప్రతి బాండుకు సంబంధించిన విశిష్ట సంఖ్య, సీరియల్ నంబర్‌తోసహా అన్ని వివరాలను అందచేయాలని తెలిపింది. భవిష్యత్తులో ఎటువంటి వివా దం తలెత్తకుండా ఎస్‌బిఐ చైర్‌పర్సన్ గురువారం (21 మార్చి) సాయంత్రం 5 గంటల లోగా కోర్టు లో ఒక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. తమ వద్ద ఉన్న అన్ని వివరాలను అందచేశామని, ఎటువంటి వివరాలను ఆపలేదని అఫిడవిట్‌లో పేర్కొనాలని కూడా ధర్మాస నం ఎస్‌బిఐని ఆదేశించింది. కాగా. ఇప్పటి వరకు విక్రయించిన ఎన్నికల బాండ్లకు సంబంధించిన వివరాలను మార్చి 6వ తేదీటా ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని ఫిబ్రవరి 15న ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఎస్‌బిఐని ఆదేశించింది. ఈ వివరాలను ఎన్నికల క మిషన్ మార్చి 13లోగా తన అధికారిక వెబ్‌సైట్ లో ప్రచురించాలని కూడా చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ సంజయ్ ఖన్నా, జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ జెబి పార్డీవాలా, జస్టిస్ మ నోజ్ మిశ్రాలతో కూడిన ఐదుగురు సభ్యుల రా జ్యాంగ ధర్మాసనం ఆదేశించింది. బాండ్ల వివరా ల వెల్లడిపై తమ తీర్పును సుమోటోగా సమీక్షించాలని కోరుతూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిష్ సి అగర్వాల్ లేఖను పరిశీలించడానికి సైతం సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. ఇలా ఉండగా కొన్ని రాజకీయ పార్టీలను మినహాయించి ప్రధాన రాజకీయ పార్టీలేవీ దాత ల వివరాలను ఇవ్వలేదని అసోసియేషన్ ఫర్ డె మోక్రటిక్ రిఫార్మ్(ఎడిఆర్) తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టుకు తెలిపారు. కాగా..ఎరాజకీయ పార్టీలకు అందిన ఎన్నికల బాండ్ల వివాల వెల్లడిపై గణాంకాలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ఈ ప్రక్రియలో కోర్టును ఇబ్బంది పెడుతున్నారని కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ తు షార్ మెహతా ఆరోపించారు. దీనిపై సిజెఐ డివై చంద్రచూడ్ స్పందిస్తూ న్యాయమూర్తులుగా తాము చట్టం, రాజ్యాంగం ప్రకారం మాత్రమే పనిచేస్తామని తెలిపారు. దేశ రాజకీయ వ్యవస్థలో చట్టాల అమలు సక్రమంగా చూడడమే తమ బాధ్యతని ఆయన తెలిపారు. సోషల్ మీడియాలో తమపై చ ర్చ జరుగుతోందని, అయితే వాటిని ఎదుర్కొనగలమని ఆయన చెప్పారు. తాము తమ ఆదేశాల అ మలు కోసమే ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

# అధర్మం, అవినీతి, అసత్య శక్తికి వ్యతిరేకంగా పోరాడాలనే చెప్పా

## విమర్శలెదుర్కొంటున్న తన వ్యాఖ్యలపై రాహుల్ వివరణ



**మార్చి18(జర్నలిస్ట్ వార్త):**
**ఢిల్లీ, ముంబయి:** అధర్మం, అవినీతి, అసత్యాలతో కూడిన శక్తికి వ్యతిరేకంగా పోరాడాలనే తాను వ్యాఖ్యానించానని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.అంతేతప్ప 'శక్తికి వ్యతిరేకంగా పోరాడాలి' అన్న తన మాటలు ఏ మతపరమైనవి కావని పేర్కొన్నారు. ముంబయిలో ఆదివారం జరిగిన 'భారత్ జోడో న్యాయ యాత్ర' ముగింపు సభలో రాహుల్ చేసిన 'శక్తి' వ్యాఖ్యలపై విమర్శలు తలెత్తడంతో ఆయన వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలను ప్రధాని నరేంద్ర మోదీ వక్రీకరించారని రాహుల్ ఆరోపించారు. మోదీ ధరించిన ముసుగు శక్తి గురించే తాను మాట్లాడానన్నారు. 'మోదీకి నా మాటలంటే ఇష్టం ఉండదు. వాటి అర్థాన్ని ఆయన ఎల్లప్పుడూ మార్చేస్తుంటారు. ఎందుకంటే అవి అక్షర సత్యాలని ఆయనకు తెలుసు. నేను ప్రస్తావించిన శక్తికి ముసుగురూపమే మోదీ. ఆ శక్తి భారత గొంతును నొక్కేసింది. దేశీయ సంస్థలను గుప్పిట్లోకి తీసుకుంది. సీబీఐ, ఐటీ, ఈడీ, ఎన్నికల కమిషన్, మీడియా, భారత పారిశ్రామిక రంగం, రాజ్యాంగ వ్యవస్థలు దాని కబంధ హస్తాల్లో చిక్కుకున్నాయి' అని 'ఎక్స్'లో రాహుల్ హిందీలో పోస్టు చేశారు.

# ఆరు రాష్ట్రాల్లో హోంశాఖ సెక్రటరీల తొలగింపు




**న్యూదిల్లీ,మార్చి18(జర్నలిస్ట్ వార్త):** : లోక్ సభ ఎన్నికల సమీపిస్తున్న క్రమంలో ఎలక్షన్ కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆరు రాష్ట్రాలకు చెందిన హోంశాఖ సెక్రెటరీలను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.గుజరాత్, ఉత్తర ప్రదేశ్, బీహార్, జార?ండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి ఆరు రాష్ట్రాల్లో హోంశాఖ కార్యదర్శిని తొలగిస్తూ భారత ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. అదనంగా మిజోరాం, హిమాచల్ ప్రదేశ్లోని సాధరాణ పరిపాలన విభాగం కార్యదర్శిని కూడా తొలగించారు. పశ్చిమ బెంగాల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)ని తొలగించేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. బృహన్ ముంబై మున్సిపల్ కమిషనర్ ఇక్బాల్ సింగ్ చాహల్ తో పాటు పలువురు అదనపు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లను ఈసీఐ తొలగించింది. వీరితోపాటు మిజోరాం, హిమాచల్ ప్రదేశ్ లోని జీఏడీ కార్యదర్శులు, ముఖ్యమంత్రుల కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందిని

# మా మధ్య భేదాభిప్రాయాలు లేవు




**మార్చి18(జర్నలిస్ట్ వార్త):**ముంబయి: మా మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని ముంబయి ఇండియన్ నూతన సారథి హార్దిక్ పాండ్యా చెప్పుకొచ్చాడు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హార్దిక్ ఈ వ్యాఖ్యలు చేశాడు. హెడ్‌కోచ్ మార్క్ బౌచర్‌తో కలిసి ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పాండ్యా మాట్లాడుతూ.. 'కెప్టెన్సీ మార్పుతో భిన్నంగా ఏమీ ఉండదు. రోహిత్ నాకు సాయం చేసేందుకు నిత్యం నాకు మద్దతుగా ఉంటాడు. నాకు అవసరమైనప్పుడల్లా నా భుజం తడతాడు. నేను నా కెరీర్‌ను అతడి హయాంలోనే అరంగేట్రం చేయడమే గాక రాబోయే టి20 వరల్డ్ కప్‌లో కూడా అతడి సారథ్యంలోనే ఆడాల్సి ఉంటుంది..' అని చెప్పాడు. కెప్టెన్సీ మార్పుపై రోహిత్ అభిమానులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. దీనిపై హార్దిక్ మాట్లాడుతూ%ొూ% 'కెప్టెన్‌ను మార్చిన తర్వాత కొంతమంది అభిమానులు అసహనంతో ఉన్నారన్న విషయం నా దష్టికీ వచ్చింది. నేను వారి భావోద్వేగాల్ని గౌరవిస్తాను. కానీ నేను నియంత్రించగలిగేది మాత్రమే నియంత్రిస్తా. నా చేతుల్లో లేనిదానిని నేను ఏమీ చేయలేను. నేను పూర్తిగా ఆటమీదే దష్టి సారిస్తా..' అని తెలిపాడు. ఇంతవరకూ రోహిత్ శర్మతో మాట్లాడలేదని, గత కొంతకాలంగా రోహిత్ ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో నిమగమై ఉన్నాడని, అందుకే అతడితో మాట్లాడే వీలు దొరకలేదని అన్నాడు. అలాగే ఇటీవల కాలంలో మేమిద్దరం ఎదురెదురుగా ఉండి మాట్లాడుకునే అవకాశం కూడా రాలేదని, త్వరలోనే అతడు ముంబయి క్యాంప్‌లో జాయిన్ అవుతాడు. అప్పుడు రోహిత్‌తో మాట్లాడతా..' అని అన్నాడు. తాను కెప్టెన్ అయినప్పటికీ రోహిత్ తనకు ఎప్పుడూ అండగా ఉంటాడని, రాబోయే టి20 ప్రపంచకప్‌లో అతడి సారథ్యంలోనే తాను భారత జట్టుకు ఆడాల్సి ఉందని పాండ్యా చెప్పాడు. కాగా ఐపిఎల్ 17వ ఎడిషన్‌కు ముందు ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజీ కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. గుజరాత్ టైటాన్స్ నుంచి భారీ మొత్తానికి ట్రేడ్ చేసుకున్న హార్దిక్ పాండ్యాకు పగ్గాలు అప్పగించి.. ఐదుసార్లు జట్టును చాంపియన్‌గా నిలిపిన రోహిత్ శర్మపై వేటు వేసింది.ఐపిఎల్ 17వ సీజన్ తొలి ఆరంభమ్యాచ్ టికెట్లకోసం అభిమానులు పోటెత్తారు. చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరుల మధ్య జరిగే ఆరంభ మ్యాచ్ టికెట్లను బిసిసిఐ సోమవారం ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టింది. ఉదయం 930 గంటలకు పేటిఎమ్ ఇన్‌సైడర్‌లో టికెట్ల అమ్మకాలు ప్రారంభం కాగా.. సర్వర్ మొరాయించి టికెట్ల అమ్మకాలు నిలిచిపోయాయి. ఊహించని పరిణామంతో షాక్ తిన్న సీఎస్కే-ఆర్సీబీ ఫ్యాన్స్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అభిమానులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు తెలియజేస్తూ పేటిఎమ్ ఇన్‌సైడర్ ప్రకటన విడుదల చేసింది. టికెట్ల సేల్ గురించి త్వరలోనే అప్‌డేట్ ఇస్తామని పేర్కొంది. అలాగే టికెట్ పొందినవారికి ప్రింట్ అవుట్ అవసరం లేదని, ఫోన్‌లో ఈ-టికెట్లను చూపించినా సరిపోతుందని చెపాక్ స్టేడియం నిర్వాహకులు తెలిపారు. పదిహేడో సీజన్ తొలి మ్యాచ్ మార్చి 22న చిదంబరం స్టేడియంలో జరగనుంది.

# హర్మన్‌ప్రీత్ సారథ్యంలో.... ఆస్ట్రేలియా పర్యటనకు భారత హాకీ జట్టు




**మార్చి18(జర్నలిస్ట్ వార్త):**న్యూఢిల్లీ: వచ్చే నెలలో ఆస్ట్రేలియాలో పర్యటించే భారత పురుషుల హాకీ జట్టును ప్రకటించారు. చీఫ్ కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ ఆధ్వర్యంలో భువనేశ్వర్‌లో 28 మంది ఆటగాళ్లతో శిక్షణ శిబిరం నిర్వహించారు.ఈ జాబితా నుంచి రబిచంద్ర సింగ్‌ను తప్పించి మిగతా 27 మందితో టీమిండియా ఆస్ట్రేలియాకు వెళ్లనుంది. డ్రాగ్ ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా, హార్దిక్ సింగ్ వైస్ కెప్టెన్‌గా కొనసాగుతారు. పారిస్ ఒలింపిక్స్ సన్నాహాల్లో భాగంగా భారత జట్టు పెర్త్ వేదికగా ఏప్రిల్ 1, 6, 7, 10, 12, 13వ తేదీల్లో ఆస్ట్రేలియా జట్టుతో ఐదు మ్యాచ్‌లు ఆడుతుంది.
భారత హాకీ జట్టు: పీఆర్ శ్రీజేశ్, కృషన్ బహదూర్ పాఠక్, సూరజ్ కర్కేరా (గోల్‌కీపర్లు)బీ హర్మన్‌ప్రీత్ సింగ్, జర్మన్‌ప్రీత్ సింగ్, జుగ్‌రాజ్ సింగ్, అమిత్ రోహిదాస్, సంజయ్, సుమిత్, అమీర్ అలీ (డిఫెండర్లు)బీ మన్‌ప్రీత్ సింగ్, హార్దిక్ సింగ్, షంషేర్ సింగ్, విష్ణుకాంత్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, నీలకంఠ శర్మ, రాజ్‌కుమార్ పాల్ (మిడ్ ఫీల్డర్లు)బీ ఆకాశ్‌దీప్ సింగ్, మన్‌దీప్ సింగ్, దిల్‌ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్, గుర్జంత్ సింగ్, అరిజీత్ సింగ్ హుండల్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, అభిషేక్, మొహమ్మద్ రాహీల్ మౌసీన్, బాబీ సింగ్ ధామి (ఫార్వర్డ్స్).

# దివ్యాంశ్, రమిత కొత్త ప్రపంచ రికార్డులు





**మార్చి18(జర్నలిస్ట్ వార్త):**
డార్ట్‌మండ్ (జర్మనీ): ఇంటర్నేషనల్ సైసన్ స్టార్ట్ ఫర్ షూటర్స్ (ఐఎస్ఎఎస్) షూటింగ్ టోర్నీలో భారత రైఫిల్ షూటర్లు దివ్యాంశ్ సింగ్ పన్వర్, రమితా జిందాల్ కొత్త ప్రపంచ రికార్డులు సృష్టించారు.పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ ఫైనల్లో దివ్యాంశ్ 254.4 పాయింట్లు స్కోరు చేసి పసిడి పతకం గెలిచాడు.
ఈ క్రమంలో 253.7 పాయింట్లతో తన పేరిటే ఉన్న ప్రపంచ రికార్డును దివ్యాంశ్ బద్దలు కొట్టాడు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్ ఫైనల్లో రమిత 254.1 పాయింట్లు స్కోరు చేసి బంగారు పతకం సొంతం చేసుకుంది. అంతేకాకుండా 254 పాయింట్లతో హాన్ జియాయు (చైనా) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును రమిత సవరించింది.

## భారత్ పతక జోరు పోలిష్ షూటింగ్ గ్రాండ్‌ప్రి




**మార్చి18(జర్నలిస్ట్ వార్త):**న్యూఢిల్లీ: పోలిష్ గ్రాండ్‌ప్రి షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు అదరగొడుతున్నారు. సోమవారం జరిగిన వేర్వేరు విభాగాల్లో మన షూటర్లు ఆరు పతకాలు ఖాతాలో వేసుకున్నారు.పురుషుల 50మీటర్ల రైఫిల్-3 పొజిషన్‌లో అఖిల్ షెరాన్ పసిడి పతకంతో మెరిశాడు.ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన పోరులో అఖిల్ 468.4 పాయింట్లతో టాప్‌లో నిలువగా, ప్యాట్రిక్ జనీ, లొంగో స్లాస్కా వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. పురుషుల 25మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో అనీశ్ భన్వాల పసిడి కైవసం చేసుకున్నాడు. పురుషుల రైఫిల్ 3 పొజిషన్‌లో నీరజ్‌కుమార్ రెండు కాంస్య పతకాలు సొంతం చేసుకోగా, మహిళల 3 పొజిషన్‌లో శ్రీయాంకకు కాంస్యం, అశి చౌక్సీకి రజతం లభించాయి.



# పూజా హెగ్డే.. బ్యాడ్ టైమ్ లో బంపరాఫర్లు!

పూజా హెగ్డే.. ఒకప్పుడు టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు ఛాన్సుల కోసం వెయిట్ చేస్తోంది. రాధేశ్యామ్, ఆచార్య డిజాస్టర్ల తర్వాత ఈ ముద్దుగుమ్మకు ఆఫర్స్ బాగా తగ్గిపోయాయి. ఆ తర్వాత మహేశ్ బాబు గుంటూరు కారంతోపాటు పవన్ ఉస్తాద్ భగత్ సింగ్ నుంచి ఆమెనే తప్పుకుంది. రెండేళ్ల క్రితం వరుస సినిమాలతో అలరించిన ఈ ముద్దుగుమ్మ.. ఇటీవల మళ్లీ అవకాశాలు అందుకున్నట్లు తెలుస్తోంది. పుష్ప-2 తర్వాత అల్లు అర్జున్.. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీతో సినిమా చేయనున్నారని ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఆ సినిమాలో హీరోయిన్ గా పూజా హెగ్డే ఛాన్స్ దక్కించుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే అల్లు అర్జున్, పూజ కాంబోలో వచ్చిన అల వైకుంఠపురములో మూవీ సూపర్ హిట్ అయిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ తో పాటు నందినీ రెడ్డి దర్శకత్వంలో సిద్ధూ జొన్నలగడ్డ నటిస్తున్న సినిమాలో కూడా పూజకు ఛాన్స్ వచ్చినట్లు సమాచారం. ఈ రెండు క్రేజీ ప్రాజెక్టులకు సంబంధించిన వార్తలు నెట్టింట చక్కర్లు కొడుతున్నా.. ఇంకా అధికారిక ప్రకటనలు రావాల్సి ఉంది. అయితే గుంటూరు కారం సినిమా నుంచి తప్పుకున్న తర్వాత బాలీవుడ్ పై దృష్టి పెట్టింది పొడుగు కాళ్ళ సుందరి. సౌత్ లో అవకాశాలు తగ్గడంతో నార్త్ పై ఫోకస్ పెట్టింది. దక్షిణాదిలో అవకాశాల కోసం ట్రై చేస్తూనే.. ఉత్తరాదిలో అందిపుచ్చుకుంటోంది. బీ టౌన్ లో వరుస ప్రాజెక్టులను లైన్ లో పెడుతోంది. ఇటీవల బాలీవుడ్ మూవీ దేవా సెట్స్ లోకి అడుగుపెట్టింది పూజ. రోషన్ ఆండ్రూస్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో పూజ ఇప్పటి వరకు కనిపించని రోల్ లో సందడి చేయనుంది. ముంబైలో జరుగుతున్న షెడ్యూల్ లో ఇటీవల పాల్గొంది. ఓ యువ పోలీసు అధికారి కేసును దర్యాప్తు చేసే సమయంలో ఎదురైన సవాళ్ల చుట్టూ తిరిగే స్టోరీతో రూపొందుతున్న సినిమాలో షాహిద్ కపూర్ సరసన నటిస్తోంది. మరోవైపు, దేవాతో పాటు కార్తీక్ ఆర్యన్ నటిస్తున్న కొత్త మూవీలో ఆమె ఛాన్స్ దక్కించుకుంది. అహాన్ శెట్టి హీరోగా నటిస్తున్న సంకీలోనూ హీరోయిన్ గా ఎంపికైంది. వచ్చే ఏడాది వాలెంటైన్స్ డే కానుకగా విడుదల కానుందీ చిత్రం. గతేడాది కిసీ కా భాయ్ కిసీ కి జాన్ సినిమాతో హిందీ ఆడియన్స్ ను పలకరించింది. మరి పూజా హెగ్డే నటిస్తున్న కొత్త చిత్రాలు ఆమెకు ఎలాంటి హిట్లు తెచ్చిపెడతాయో చూడాలి.

# హీరోగా యాంకర్ ప్రదీప్ మళ్ళీ ఇన్నాళ్ళకు



నేచురల్ స్టార్ నాని ఆర్జేగా చేస్తూ మూవీలో హీరోగా మారి ప్రస్తుతం తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ ని క్రియేట్ చేసుకున్నాడు. అలాగే తమిళంలో శివకార్తికేయన్ కూడా ఆర్జే నుంచి టెలివిజన్ యాంకర్ గా మారి తరువాత నటుడిగా మారి ఇప్పుడు సక్సెస్ ఫుల్ హీరోగా దూసుకుపోతున్నాడు. వీరి బాటలోనే ప్రదీప్ కూడా ఆర్జే స్థాయి నుంచి బుల్లితెరపై నెంబర్ వన్ యాంకర్ స్థాయికి ఎదిగాడు. అన్ని ఛానల్స్ లో గేమ్ షోలు, డాన్స్ షోలు, ఈవెంట్స్ చేస్తూ ఫుల్ బిజీగా ఫేమ్ అందుకున్నాడు. ఆర్జేగా కెరియర్ స్టార్ట్ చేసిన ప్రదీప్ తరువాత సినిమాలలో చిన్న చిన్న క్యారెక్టర్స్ చేస్తూ నటుడిగా మారాడు. నెక్స్ట్ యాంకర్ గా బుల్లితెరపై సక్సెస్ అయ్యాడు. నటుడిగా అప్పుడప్పుడు సిల్వర్ స్క్రీన్ పై మెరుస్తూ ఉన్న ప్రదీప్ కి హీరోగా బ్రేక్ ఇచ్చింది మాత్రం 30 రోజుల్లో ప్రేమించడం ఎలా అనే మూవీ. లవ్ స్టోరీతో తెరకెక్కిన ఈ సినిమాతో హీరోగా మారి సక్సెస్ అందుకున్న కూడా ప్రదీప్ యాంకర్ గానే కొనసాగుతున్నాడు. ఆ మూవీ సక్సెస్ తర్వాత హీరోగా చాలా అవకాశాలు వచ్చిన సెలక్టివ్ గా తనకి సెట్ అయ్యే కథలు మాత్రమే చేయాలని ప్రదీప్ లాంగ్ గ్యాప్ తీసుకున్నారు. మరల మూడేళ్ళ తర్వాత ఇప్పుడు కొత్త ప్రాజెక్ట్ ని స్టార్ట్ చేయబోతున్నాడని తెలుస్తోంది. ఇప్పటికే ఆ సినిమా షూటింగ్ కూడా సైలెంట్ గా కంప్లీట్ చేసేసాడంట. త్వరలో ఈ సినిమా సందడి స్టార్ట్ కాబోతోందని తెలుస్తోంది. ఫస్ట్ లుక్ పోస్టర్ తో సినిమా గురించి రివీల్ చేసే ఛాన్స్ ఉంది. అలాగే సమ్మర్ కానుకగా రిలీజ్ చేయాలని భావిస్తున్నారంట. రిలీజ్ డేట్ ఎప్పుడనేది కూడా త్వరలో కన్ఫర్మ్ చేసే అవకాశం ఉందని టాక్. ప్రస్తుతం మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉందని సమాచారం. బుల్లితెరపై కూడా ప్రదీప్ ఈ మధ్యలో గతంలో కనిపించినంత ఎక్కువగా హైలెట్ కావడం లేదు. అక్కడ కూడా రొటీన్ షోలు ఎక్కువ కావడంతో చాలా వరకు తగ్గించేశాడు. ఇక కొత్తగా ట్రై చేయాలని వెండితెరపై హీరోగా కూడా తనకంటూ బ్రాండ్ క్రియేట్ చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాడు. రాబోయే సినిమా కానీ హిట్ అయితే ప్రదీప్ కి మరిన్ని అవకాశాలు క్యూ కడతాయని చెప్పొచ్చు. అలాగే పెద్ద బ్యానర్స్ కూడా ప్రదీప్ మీద ప్రత్యేకంగా ఫోకస్ చేసే అవకాశం ఉందని టాలీవుడ్ సర్కిల్ లో వినిపిస్తోన్న మాట.

# త్వరలో ఆ డైరెక్టర్స్ ను కలుస్తాను : 'మీన్ గర్ల్స్' అవంతిక



అవంతిక .. 'మీన్ గర్ల్స్' నుంచి ఈ పేరు అందరి నోళ్లలో నానుతోంది. అమెరికన్ టీన్ మ్యూజికల్ కామెడీ సినిమా ఇది. ఇక రీసెంటుగా అవంతిక %--%నుంచి 'బిగ్ గర్ల్స్ డోంట్ క్రై' అనే సిరీస్ కూడా వచ్చింది. దాంతో ఆమె క్రేజ్ మరింతగా పెరిగిపోయింది. యూత్ లో చాలా వేగంగా ఫాలోయింగ్ ను సంపాదించుకున్న అవంతిక, తాజాగా 'ఐ డ్రీమ్' వారికి ఇంటర్వ్యూ ఇచ్చింది.'మీన్ గర్ల్స్' కి నేను ఆడిషన్స్ పంపించిన తరువాత మూడు నెలల పాటు అటు వైపు నుంచి నాకు ఎలాంటి రెస్పాన్స్ రాలేదు. దాంతో ఇక నాకు అవకాశం లేదనే అనుకున్నాను. అలాంటి పరిస్థితుల్లో నాకు పిలుపు వచ్చింది. అందులో నటించే ఛాన్స్ రావడం నా అదృష్టంగానే భావిస్తున్నాను. ఇంతవరకూ నా ఏజ్ కి తగిన పాత్రలను పోషిస్తూ వచ్చాను. త్వరలో ఇక్కడ హీరోయిన్ గా చేయాలని అనుకుంటున్నాను" అంది. " తెలుగులో రాజమౌళిగారు .. త్రివిక్రమ్ గారు .. సుకుమార్ గారు .. శేఖర్ కమ్ములగారి సినిమాలంటే నాకు ఇష్టం. త్రివిక్రమ్ గారి సినిమా 'అజ్ఞాతవాసి'లో నటించాను. హీరోయిన్ గా వాళ్లందరి సినిమాల్లో కనిపించాలని ఉంది. త్వరలో వాళ్లను కలవాలనీ .. ఆడిషన్స్ ఇవ్వాలని అనుకుంటున్నాను" అని చెప్పింది.

# 'కల్కి 2898' కోసం భారీ సెట్ .. కీలకమైన షెడ్యూల్!


ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ' సినిమాను రూపొందిస్తున్నాడు. అశ్వనీదత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అత్యధిక బడ్జెట్ తో నిర్మితమవుతున్న సినిమా ఇది. పాన్ వరల్డ్ సినిమా అంటూ ఆదిలోనే ఈ ప్రాజెక్టుపై నాగ్ అశ్విన్ అంచనాలు పెంచేశాడు. అప్పటి నుంచి ఈ సినిమా విశేషాలు ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి అభిమానులు ఆసక్తిని చూపిస్తున్నారు. ఈ సినిమాకి సంబంధించిన కొన్ని షెడ్యూల్స్ ఆల్రెడీ పూర్తయ్యాయి. ఇటీవలే పూర్తి చేసుకున్న ఒక షెడ్యూల్లో ప్రభాస్ – దిశా పటాని కాంబినేషన్లో ఒక రొమాంటిక్ సాంగ్ ను షూట్ చేసినట్టుగా తెలుస్తోంది. ఈ సాంగ్ ను ఆడియన్స్ ఒక రేంజ్ లో ఎంజాయ్ చేస్తారని అంటున్నారు. త్వరలోనే మరో షెడ్యూల్ ను మొదలెట్టడానికి సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ షెడ్యూల్లో ప్రభాస్ .. అమితాబ్ .. కమల్ పాల్గొననున్నారు. ఈ ముగ్గురి కాంబినేషన్లోని కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తారట. అందుకు అవసరమైన భారీ సెట్ ను హైదరాబాద్ – రామోజీ ఫిల్మ్ సిటీలో వేశారని సమాచారం. ఇది చాలా కీలకమైన షెడ్యూల్ అని అంటున్నారు. ఈ సీన్స్ కూడా కథలో కీలకమైన సమయంలో తెరపైకి వస్తాయని చెబుతున్నారు. సంతోష్ నారాయణ్ నేపథ్య సంగీతం హైలైట్ గా నిలుస్తుందని అంటున్నారు



# మెగాస్టార్ అరుదైన సర్టిఫికెట్ వైరల్



మెగాస్టార్ చిరంజీవి కి చెందిన చిన్న విషయం కూడా సోషల్ మీడియాలో వైరల్ అవ్వడం మనం చూస్తూ ఉంటాం. ఆయనకు సంబంధించిన ఏ విషయం బయటకు వచ్చినా కూడా క్షణాల్లో సోషల్ మీడియా ద్వారా ప్రపంచం మొత్తం విస్తరిస్తుంది అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నిన్న మొన్నటి వరకు తాను నటిస్తున్న విశ్వంభర సినిమాతో వార్తల్లో నిలిచిన మెగాస్టార్ చిరంజీవి నేడు తన 10వ తరగతి స్టడీ సర్టిఫికెట్ కారణంగా వార్తల్లో నిలిచారు. ఎలా బయటకు వచ్చిందో.. ఎప్పుడు బయటకు వచ్చిందో కానీ చిరంజీవి యొక్క 10వ తరగతి స్టడీ సర్టిఫికెట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ సర్టిఫికెట్ లో ఉన్న వివరాలు ఏంటి అంటూ క్షుణ్ణంగా తెలుసుకునేందుకు నెటిజన్స్ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ సర్టిఫికెట్ లో చిరంజీవి పూర్తి పేరును కేఎస్ఎస్ వర ప్రసాద్ అని, తండ్రి పేరు వెంకట్ రావు అని ఉంది. అంతే కాకుండా చిరంజీవి పెనుగొండ లో పుట్టినట్లుగా కూడా అందులో పేర్కొన్నారు. చిరంజీవి కి చెందిన ఈ సర్టిఫికెట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది ఏ సందర్భంలో తీసుకోవడం జరిగింది, ఎలా బయటకు వచ్చింది అనేది చిరంజీవి స్పందిస్తే కానీ క్లారిటీ రాదు. ఈ విషయమై ఆయన స్పందించక పోవచ్చు. కనుక ఎవరికి తోచినట్టు వారు కథనాలు అల్లుతున్నారు. ఇక చిరంజీవి సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం వశిష్ఠ దర్శకత్వంలో విశ్వంభర సినిమాను చేస్తున్నాడు. ఆ సినిమా షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. 2025 సంక్రాంతికి ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు.



SECONDARY SCHOOL CERTIFICATE
(Issued under the Authority of the Government of Andhra Pradesh)
Serial Number 25457-A
1. Name of the pupil (in full) .. K.S.S. VARAPRASADARAO
2. Father's Name .. VENKATARAO
3. Nationality .. Indian Hindu Telaga
4. Sex .. Male
5. Date of birth (in figures and words) .. 22.8.1955 Twenty Second August
6. Place of birth .. Penugonda
7. Personal marks of identification
8. Nature of course .. Academic
Head Master
Name of the School. Class VIII to IX Period of study.